క్లుప్తంగా

నేడు ప్రజావాణి

తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చిన్నప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు.

భద్రేశ్వర స్వామి సన్నిధిలో శుభప్రద్ పటేల్



స్వామి వారిని దర్శించుకున్న శుభప్రద్ పటేల్

తాండూరు: తాండూరు భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానంలో 2వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

నీటి కాలువకు మరమ్మతు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని పెద్ద చెరువు నీటి కాలువకు మరమ్మతు చేయించాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ మేరకు ఆదివారం పెద్ద చెరువు కట్టపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చెరువులో నీరు పుష్కలంగా ఉన్నా.. కాలువకు మరమ్మతు చేయకపోవడంతో నీరు విడుదల కావడంలేదని తెలిపారు. కాలువ కూడుకు పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. తాము మరమ్మతు చేసుకునేందుకు వీలులేదని, జేసీబీ, ఇటాచి సహాయంతో మరమ్మతు చేయించి, సాగుకు నీరందించాలని కోరుతున్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నదీమ్ జావిద్, రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి: మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి నదీమ్ జావిద్, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో టీఆర్ఆర్ నివాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం చాలా పవిత్రమైందని, నిష్టతో ఆచరించే ఉపవాస దీక్షలు, దైవప్రార్థనతో మత సామరస్యం, శాంతి వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, కాంగ్రెస్ యువజన నాయకులు రితిక్‌రెడ్డి, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్నకు బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

చేవెళ్ల: మండలంలోని గొల్లగూడలో ఆదివారం మల్లన్న స్వామి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు బోనాల ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్తుంటే బోనాల ముందు పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువత కేరింతలు, డప్పుల చప్పులతో ఊరేగింపు సాగింది. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ రాంచంద్రయ్య, ఉప సర్పంచ్ విఠలయ్య, ఎంపీటీసీ మాధవి, మాజీ ఎంపీటీసీ జంగయ్య, మాజీ సర్పంచ్ హన్మంత్ రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

షాబాద్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం మండలంలోని ఆస్పల్లిగూడలోని మధుసూదన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొని త్వరగా కోలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొడంగల్ ఇన్‌చార్జి జైపాల్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైకేల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి పొడవునా గుంతలే

- అధ్వానంగా లక్ష్మీనారాయణపూర్–యాలాల రోడ్డు
- అవస్థలు పడుతున్న వాహనదారులు



యాలాల: బెన్నూరు సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

యాలాల: లక్ష్మీనారాయణపూర్ నుంచి యాలాల వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆరు కిలోమీటర్ల వరకు ఉన్న ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో సింగిల్ బీటీరోడ్డు ఉండే ఇక్కడ.. ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులు చేపట్టి రెండు వరుసల రహదారిని నిర్మించింది. అయినప్పటికీ.. వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది.

సమస్య పట్టని ఆర్అండ్‌బీ..

లక్ష్మీనారాయణపూర్ వన నర్సరీకి ఎదురుగా ఉన్న ఈ రోడ్డుపై, బెన్నూరు శిలువ మలుపు వద్ద, జక్కేపల్లి గేటు, ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీ ఎదుట, హాజీపూర్, సంగెంకుర్దు గేట్ల వద్ద రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. గుంతలతో పాటు గతంలో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా పాత రోడ్డుకు ఇరు వైపులా వేసిన రోడ్డు పెచ్చులుగా ఊడిపోతోంది. దీంతో చాలా చోట్ల ఈ ప్రదేశం సమాంతరంగా లేకపోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య అలాగే ఉండిపోయింది. రోడ్ల విషయమై ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు సమస్యను లేవనెత్తినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులు దృష్టిసారించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కాలినడకనా కష్టమే..



బంట్వారం: మద్వాపూర్-కోట్‌పల్లి రోడ్డు దుస్థితి

బంట్వారం: మట్టి రోడ్డుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. బంట్వారం మండలం మద్వాపూర్ గ్రామం నుంచి కోట్‌పల్లి వరకు సుమారు 4 కిలోమీటర్ల మట్టి రోడ్డు ఉంది. లింకు రోడ్డు కావడంతో వాహనదారులు ఎక్కువగా ఈ దారిగుండా వెళ్తుంటారు. సల్బత్తాపూర్ మీదుగా వెళ్తే దూరం భారం పెరుగుతుందని, మద్వాపూర్ వాసులు కోట్‌పల్లికి నిత్యం ఇదే మట్టి రోడ్డుపై పయనిస్తుంటారు. ఆటోలు కూడా నడవలేని ఈ గతుకుల రోడ్డుపై ద్విచక్ర వాహనాలు అతి కష్టంమీద వెళ్తుంటాయి. ప్రతి సోమవారం కోట్‌పల్లిలో సంత జరుగుతుండడంతో మద్వాపూర్ గ్రామస్తులు ఎక్కువగా కాలినడకనే ఎంచుకుంటారు. వర్షాకాలమైతే అది కూడా కష్టమే. కనీసం మెటల్ రోడ్డు వేసినా బాగుండేదని స్థానికులు అంటున్నారు. సమస్యను సంబంధిత పంచాయతీ రాజ్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని, రోడ్డు నిర్మాణానికి కనీసం అవసరమైన ప్రతిపాదనలు కూడా ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి పంపించ లేదంటూ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులతో భక్తులకు ఇబ్బంది

- జాతరలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల వర్గపోరు
- ఆ ఇద్దరికి ఇదే చివరి ఉత్సవం
- ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్



ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్

తాండూరు: భావిగి భద్రేశ్వర దేవాలయ జాతరలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల వర్గపోరుతో భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ మండిపడ్డారు. దశాబ్దాలుగా దేవాలయ ఉత్సవాలు అత్యంత వైభవంగా.. ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపారు. అయితే దైవకార్యంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు రెండేళ్లుగా ఆదిపత్యపోరుకు తెరలేపడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. దేవస్థానాలను రాజకీయ వేదికలుగా మారుస్తూ పబ్బం గడపటం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. ఇద్దరు నేతలు తాండూరు అభివృద్ధిలో పోటీ పడాలి కానీ.. జాతరలో పోటీ పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాటి నుంచి ఆలయ రథోత్సవం జరుగుతోందని, అందులో అధికార పక్షం, విపక్షాలు అందరూ కలిసి సోదరభావంతో పండుగలు జరుపుకొన్నాయని గుర్తుచేశారు. ఇద్దరు నేతలకు ఇదే చివరి జాతర అని, వచ్చే ఉత్సవాల్లో ప్రజలు ఎక్కడ కూర్చోబెట్టాలో అక్కడే కూర్చో బెడతారని ఎద్దేవా చేశారు.

అన్ని మతాలకు సమప్రాధాన్యం

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ముస్లింలు

కొడంగల్ రూరల్: తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్‌హాలులో ప్రభుత్వం తరపున ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాల పండుగలకు బహుమతులు అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పర్సాపూర్ సర్పంచ్ సయ్యద్ అంజద్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, నియోజకవర్గంలోని ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొడంగల్: అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందికి విద్యుత్ పరికరాల వినియోగంపై తగిన సూచనలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలపై సలహాలు, సూచనలు ఇచ్చినట్లు ఆ శాఖ కొడంగల్ ఇన్‌చార్జి, ఫైర్ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో వివిధ రకాల పరికరాలు ఉంటాయని, వాటి వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, శ్యామప్ప, బొరానొద్దీన్, శాంతీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మంటలు ఆర్పే విధానాన్ని చూపిస్తున్న ఫైర్ సిబ్బంది

అప్రమత్తంగా ఉండాలి

వికారాబాద్ అర్బన్: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి సురేందర్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మిషన్ ఆసుపత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోకుండా సంభవించే ఫైర్ యాక్సిడెంట్ల నుంచి బయట పడేందుకు కొన్ని మెలకువలు అవసరమన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, గ్యాస్ సిలిండర్ పేలిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. అనంతరం డాక్టర్ అవినాష్ సీపీఆర్‌పై అగ్నిమాపక సిబ్బందికి అవగాహన కల్పించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

దోమ: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు, పరిగి మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం దిర్సంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అంజిలయ్య అనారోగ్యంతో మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్‌రెడ్డి, నేతలు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



మాట్లాడుతున్న రాజేష్‌పటేల్

కొందుర్గు: క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమేనని, ఓటమి గెలుపునకు నాందిగా భావించాలని వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ అన్నారు. మండలంలోని ఆగిర్యాలలో అంబేడ్కర్, పూలే జయంతిని పురస్కరించుకొని ఓపెన్ టూ ఆల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీలో కొందుర్గు జట్టు విన్నర్‌గా, బట్టనుపల్లి జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా ఆదివారం టోర్నీ ముగింపు కార్యక్రమానికి రాజేష్‌పటేల్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం కలుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి టోర్నీలు నిర్వహించడం వలన యువతలో దాగున్న నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. నాయకులు వీరేశంగుప్తా ఉన్నారు.

కొత్త జీపీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

కుల్కచర్ల: నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించి.. వాటిని అభివృద్ధి చేయాలని అఖిల భారత బంజార సేవా సంఘం పరిగి తాలూకా అధ్యక్షుడు రాహుల్ నాయక్ కోరారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త గిరిజన తండాల్లో జనాభా తక్కువగా ఉన్నందున.. వాటికి వచ్చే నిధులు తక్కువగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ప్రత్యేక నిధులు కేటాయించి, వాటి అభివృద్ధికి పాటుపడాలన్నారు. కొన్ని గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికే నీటి ఎద్దడి ఉందని, కావున ప్రభుత్వం వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు చందర్, నీల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు డబుల్ ఇళ్లు కేటాయించండి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దేవేందర్

శంకర్‌పల్లి: పారిశుద్ధ్య కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మున్సిపాలిటీలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా కార్మికులు నిరంతరం కష్టపడుతున్నారని, చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరి చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ఇళ్లు లేక అద్దె ఇళ్లల్లో ఉంటున్నారని, వారికి శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఇంటింటికీ ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు చెప్పారు. హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం గుముడాల గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వాల పనితీరుపై ప్రజలు విసుగుచెందుతున్నారని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సప్ప, వీరన్న, నర్సింగ్ భాన్‌సింగ్, చరణ్, రాజు, వెంకట్రాములు, మహిపాల్, కృష్ణ, రాజు, నర్సింహులు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గరీబ్'లపై ఇంత నిర్లక్ష్యమా?



డ్రైనేజీ నీటితో నిండిన మోరీ కాలువ

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని 29వ వార్డు గరీబ్‌నగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీలకంఠం నివాసం సమీపంలో మురుగు కాలువలు పూర్తిగా నిండి దుర్వాసన వెదజల్లుతోంది. యూజీడీ కనెక్షన్ ఇవ్వాలని స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 2019లోనే యుజీడీ కనెక్షన్ ఇవ్వాలని మున్సిపల్ ఉన్నతాధికారులు సంబంధికులకు ఆదేశాలు ఇచ్చారని, అయితే ఇంజినీరింగ్ విభాగంలోని కొందరి అధికారుల నిర్లక్ష్యం కారణంగా కనెక్షన్ ఇవ్వడం లేదని విమర్శించారు. ఫలితంగా దుర్వాసన, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గరీబ్‌నగర్ కాలనీలో యూజీడీ కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతుల అభ్యున్నతికి సహకార సంఘం కృషి



గడియారాల పంపిణీలో మాట్లాడుతున్న సొసైటీ డైరెక్టర్ కొండయ్య

కుల్కచర్ల: రైతుల అభ్యున్నతికి వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం ఎంతో కృషి చేస్తుందని సొసైటీ డైరెక్టర్ కొండయ్య, సర్పంచ్ బాలయ్యలు అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం సాల్వీడు గ్రామంలో కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులకు గడియారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందించడంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రైతులు అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో సంఘాలు కృషి చేస్తున్నాయని, ప్రస్తుతం సంఘాలు లాభాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో రైతులకు ప్రోత్సాహకంగా గడియారాలు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు హన్మంత్, బస్వరాజు, హన్మయ్య, అంజయ్య, శ్రీను, యాదయ్య, ప్రభాకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక



కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన యువకులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండల యువజన విభాగం అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్, ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు పలువురు ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం తమ పార్టీతోనే సాధ్యమని, అందుకు యువత నూతనోత్తేజంతో పనిచేయాలని సూచించారు. పరిగి నియోజకవర్గంలో అత్యధికంగా బీసీలు ఉన్నప్పటికీ రాజ్యాధికారం మాత్రం కొందరికే పరిమితమైందందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో పరిగిలో దేశం విజయకేతనం ఎగురవేస్తుందని, బీసీలందరూ ఐకమత్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు కాసాని వీరేశ్, మీడియా ఇన్‌చార్జి సురేష్, నర్సింహ, శేఖర్, రవి, రామస్వామి, అంజయ్య, హరీశ్, పవన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

25 ఏళ్ల తర్వాత కలుసుకున్న బాల్యమిత్రులు



పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు

తాండూరు టౌన్: బాల్యం మరుపురాని జ్ఞాపకాలను మిగుల్చుతుంది. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా చిన్ననాటి మిత్రులను 25 ఏళ్ల తరువాత కలిసిన వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తాండూరు పట్టణంలోని విద్యాభారతి పాఠశాలలో 1998వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక గగరాణి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన విద్యార్థినీ, విద్యార్థులంతా ఒక దగ్గర చేరుకుని, తరగతి గదిలో చేసిన చిలిపి చేష్టలు, ఉపాధ్యాయుల బోధనలను గుర్తు చేసుకుని బాల్య జీవితంలోకి పరకాయ ప్రవేశం చేసి మైమరిచి పోయారు. నాడు తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను పిలిచి, ఘనంగా సన్మానించి, మరోసారి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపిచంద్, ప్రభులింగం, కౌన్సిలర్ అంతారం లలిత, శ్రీనివాస్, ఉదయ్, హన్మంతు, నర్సింహులు, విద్యార్థులు కుమార్, సంతోష్ గౌడ్, మధుకర్, రాజశేఖర్ రెడ్డి, భాగ్యశ్రీ, అలివేణి, శ్రీదేవి, రాజ్‌కుమార్, హన్మంత్ రెడ్డి, శ్రీనివాస్, భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సాయిపూర్ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- వర్షాకాలంలో చెరువును తలపిస్తున్న రోడ్డు
- ఇరుకైన దారితో ప్రజలకు తప్పని తిప్పలు



సాయిపూర్ రోడ్డుపై ఎత్తైన స్పీడ్ బ్రేకర్‌కు తగిలి మరమ్మతుకు గురైన లారీ

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని సాయిపూర్‌కు వెళ్లే రహదారి నిర్మాణ పనులకు మోక్షమెప్పుడు కలుగుతుందోనని స్థానికులు ఎదురు చూస్తున్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి సాయిపూర్ వరకు నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో తిరుగుతుంటాయి. ఇరుకైన రోడ్డు, పైగా వంపులో ఉండడంతో చిన్నపాటి వర్షానికే ఈ ప్రాంతం చెరువుగా మారుతుండడం గమనార్హం. ఈ మార్గం దిగువన ఉండటం, మురుగు కాలువలు రోడ్డు కంటే ఎత్తుగా ఉండటంతో.. వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి, రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ రోడ్డులో ఏదైనా వాహనం చెడిపోయి నిలిచిపోతే.. ప్రజలు మరో మార్గాన్ని ఎన్నుకోవాల్సి రావడం గమనార్హం.

మంజూరు కాని నిధులు!

ఇలా ప్రతి వర్షాకాలంలో ఈ ప్రాంతమంతా జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. కొన్ని నెలల క్రితం తాణా నుంచి సాయిపూర్ వరకు బీటీ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అట్టహాసంగా ప్రకటించారు. కానీ.. ఆ నిధులు ఇంకా మంజూరు కానట్లు సమాచారం. వచ్చే వర్షాకాలం నాటికి రోడ్డు నిర్మిస్తే రవాణా కష్టాలు దూరమవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే అధికార పార్టీ బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు ఉండటం విశేషం. ఈ విషయంలో ఎమ్మెల్యే చొరవ తీసుకొని, నిధులు మంజూరయ్యేలా చేసి.. రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.